క్లుప్తంగా

పీఆర్ రికార్డుల పరిశీలన



మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఐ.పోలవరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులు తనిఖీ నిర్వహించారు. జెడ్పీ సీఈఓ సీహెచ్ ప్రసాద్ ఆదేశాల మేరకు 2016–17 సంవత్సరానికి సంబంధించిన జిల్లా పరిపాలన అధికారి సీహెచ్ ప్రసాద్, సిబ్బంది కార్యాలయంలో రిజస్టర్లు, అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు. వార్షిక ప్రక్రియలో భాగంగా ఈ తనిఖీ చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీఓ ఎ.లక్ష్మిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

ఐ.పోలవరం: వైఎస్సార్ పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా పెంచిన పెన్షన్ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పంపిణీ చేయనున్న ఈ కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం: విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల నిమిత్తం మండలంలో అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

ముమ్మిడివరం: నెహ్రూ యువక కేంద్రం, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యువజన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముమ్మిడివరం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, తారా, విశ్వాస్, మహిళా జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ, జీకే అంశాల్లో పోటీలు నిర్వహించారు.కళా సాహితి వ్యవస్థాపకులు పచ్చిమాల శివనాగరాజు, జె.సత్యనారాయణ, ఎస్.అబ్బులు, విత్తనాల వరప్రసాద్, పి.విజయకుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 10న బహుమతులు అందించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్వీ సత్యనారాయణ, అరుణ్‌కుమార్, కే.బాలు, సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు రాంజీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జనసేన నేతల పరామర్శ

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లి అడవిపేటలో ఇటీవల మరణించిన గంగుల శ్రీను కుటుంబాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ గురువారం పరామర్శించారు. ఈయన వెంట మద్దింశెట్టి పురుషోత్తం, సవరపు ప్రసాద్, ఎల్.జమ్మి ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దు



ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్రీనివాసకుమార్

తాళ్లరేవు: ట్రాన్స్‌జెండర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ హెచ్చరించారు. గురువారం కోరంగి పోలీస్‌స్టేషన్‌లో వారికి ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆంధ్రా-యానాం సరిహద్దు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ యువకుల నుంచి డబ్బులు డిమాండ్ చేయడం, వ్యాపారులను సైతం ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇటువంటివి కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్షల సన్నద్ధతపై సమావేశం



సమీక్షలో పాల్గొన్న హెచ్ఎంలు

యానాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై గురువారం పుదుచ్చేరి విద్యాశాఖ సంచాలకుడు పీటీ రుద్రగౌడ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆన్‌లైన్ మాధ్యమంగా వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో స్థానిక సమగ్ర శిక్షా అభియాన్ సమావేశ ప్రాంగణంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 వతరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన, గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరుగుదల, ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు సన్నద్ధతపై టీచర్లతో సమీక్షించారు. విద్యాశాఖాధికారి పి.లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ వరి నాట్లు..



పాతయింజరంలో ఆకుమడి సేకరణలో కూలీలు

- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం
- నియోజకవర్గంలో 10 వేల హెక్టార్లలో సాగు

ఐ.పోలవరం: ప్రస్తుత రబీ పనులతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో 80 శాతం నాట్లు, వెదజల్లు పద్ధతిలో పూర్తయ్యాయి. గత ఖరీఫ్‌లో సాగు లేకపోవడంతో రైతులు రబీ పనులు వేగవంతం చేశారు. దీనికి అనుగుణంగా అధికారులు రైతులకు సూచనలిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అధికారుల సూచనల మేరకు వెదజల్లు ప్రక్రియలో నాట్లు వేగవంతం చేశారు. దమ్ములతో పాటు, గట్టులంక వేయడం, మెరకలు సరిచేయడం చేస్తున్నారు. ముమ్మిడివరం మండలంలో 3 వేలు, కాట్రేనికోనలో 3,700, ఐ.పోలవరంలో 3,750 మొత్తం 10,450 హెక్టార్లలో వరి సాగవుతోంది. ఇప్పటి వరకూ సుమారు 7,500 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తీసుకొన్న చర్యల నేపథ్యంలో శివారు భూములకు సైతం నీటి సరఫరా మెరుగైంది. 120 రోజులకు దిగుబడి వచ్చే రకాలు దాళ్వాలో స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్-15048, ఆర్‌పి బయో-226, ఎన్ఎల్ఆర్-34449, మాత్రమే వెదజల్లు పద్ధతిలో వేసుకోవాలని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సకాలంలో విత్తనాలు అందించింది. అధికారులు సైతం నిత్యం పర్యవేక్షిస్తున్నారు.



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

ముందస్తు రబీకి సంసిద్ధం చేశాం

గత ఖరీఫ్ పంట వేయకపోవడంతో ఈసారి ముందస్తుగా రబీకి అప్రమత్తం చేశాం. ఐ.పోలవరం మండలంలో ఇప్పటి వరకూ 85 శాతం వరినాట్లు, వెదజల్లు పద్ధతిలో నాట్లు పూర్తయ్యాయి. పండుగలోపు నాట్లు పూర్తవుతాయి. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలిచ్చి, ఆర్బీకే ద్వారా ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నాం.

– ఎం.వాణి, ఎంఏఓ

బుడతలైనా.. బుగతకు తోడుగా..



కొబ్బరికాయలను బండిలో తీసుకువెళ్తున్న పుంగనూరు ఎద్దులు

అల్లవరం: భూమికి జానెడు.. పని బారెడు.. ఇదిగో ఈ పుంగనూరు ఎద్దులను చూస్తుంటే అది నిజమే అనిపిస్తోంది కదూ. మూడున్నర అడుగుల ఎత్తు ఉండే ఈ పుంగనూరు ఎద్దులు వ్యవసాయ పనుల్లో రైతుకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన యాళ్ల కాసుబాబుకు చెందిన ఆవుకు తన మకాంలో పుంగనూరు కవల దూడలు పుట్టాయి. వీటిపై ప్రత్యేక శ్రద్ధ, ప్రేమతో కనబరుస్తూ వ్యవసాయ పనులు అలవాటు చేశారు. వీటి కోసం ప్రత్యేకంగా ఒక బుల్లి బండిని తయారు చేసి చిన్న చిన్న పనులపై తర్ఫీదు ఇచ్చారు. చిన్నచిన్న పనులతో అటూ ఇటూ తిరుగుతూ సందడి చేస్తున్న ఈ బుల్లి బుడతలను చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురవుతూనే మురిసిపోతున్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

- మంత్రి విశ్వరూప్
- బెండమూర్లంకలో గడపగడపకూ

అల్లవరం: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎంపీడీఓ జి.సరోవరరావు ఆధ్వర్యంలో బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని రెబ్బనపల్లి, ఆరగట్లపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. మూడున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని మంత్రి అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. సంక్రాంతి పండుగ ముందుగానే వైఎస్సార్ ఆసరా మూడో విడత డ్వాక్రా రుణ విముక్తి డబ్బులు వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ముత్యాల వెంకటరామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ తుట్టిపు బాబి, సర్పంచ్ బద్రే సీతారత్నం, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, ఎస్సీ సెల్ రాష్ట్రకార్యదర్శులు ఉండ్రు వెంకటేశ్వరరావు, సరెళ్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ప్రధానకార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, మాజీ రాష్ట్రకార్యదర్శులు బొమ్మి ఇజ్రాయిల్, చెల్లుబోయిన శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కోతో సొంతింటి కల సాకారం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



లబ్ధిదారుకు పట్టా అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణ పేదల కోసం అల్లవరం మండలం బోడసకుర్రులో టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక 23వ వార్డుకు చెందిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో గురువారం ఇళ్ల పట్టాలను అందజేశారు. పట్టణంలోని 1632 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల ప్లాట్లు ఇవ్వడంతో మున్సిపాలిటీకి ప్రభుత్వం ఓ ప్రత్యేక గుర్తింపునిచ్చిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ, మెప్మా ప్రతినిధి దేవకీదేవి, 23వ వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా రాజేశ్వరి



రాజేశ్వరి

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలో గురువారం జరిగిన వాకర్స్ క్లబ్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పుత్సా రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎర్రమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారిగా డాక్టర్ కె.మానస, ఉపాధ్యక్షురాలిగా భమిడిపాటి పద్మావతి ఎన్నికయ్యారు. అధ్యక్షురాలు రాజేశ్వరి అంధురాలు. ఆరోగ్య క్రమశిక్షణలో అంధత్వం ఎంతమాత్రం అడ్డుకాదని ఆమె పేర్కొన్నారు. ఆమె నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ భార్య కావడం గమనార్హం. కరోనా రెండో వేవ్‌లో ఆమె చూపును కోల్పోయారు. 2022 సంవత్సరానికి అంతర్జాతీయంగా ఉత్తమ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలిగా అవార్డు పొందిన స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఈ సంవత్సర అధ్యక్షురాలు దువ్వూరి సుబ్బలక్ష్మిని సమావేశంలో ఘనంగా సత్కరించారు. క్లబ్ ప్రతినిధులు శ్రీగిరి పద్మావతి, యర్రమిల్లి రామ తులసి, వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు వైఎస్ఎన్‌మూర్తి, శిష్టా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న రామానుజ జీయర్ స్వామి

అమలాపురం టౌన్: భీమవరం భాష్యకార పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామిచే స్థానిక యెండూరి ప్లాజాలో సుదర్శన హోమం గురువారం జరిగింది. లోక కల్యాణార్థం యాగాన్ని నిర్వహించినట్లు యెండూరి సోదరులు, పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు, వెంకటాచలం దంపతులచే హోమం జరిగింది. రాష్ట్ర ఆర్య, వైశ్య మహాసభ అదనపు కార్యదర్శి యెండూరి వీర రాఘవ, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, వరదా సూరిబాబు, పట్టణ వైశ్య సంఘ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లలిత కళల్లో శాస్త్రీయత పెరగాలి



పురస్కార గ్రహీతలతో సంస్థ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరరావు తదితరులు

- పీటీఎం వార్షికోత్సవ సభలో వక్తలు

ఐ.పోలవరం: లలిత కళల్లో శాస్త్రీయత పెరగాలని జాతీయ దళిత సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పుల్లెపు తాతయ్య మెమోరియల్స్ (పీటీఎం) సంస్థ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం, 10 మందికి అతిథి సత్కారాలు, 8 మందికి బిరుదు ప్రదానాలు, కోలాటం, కూచిపూడి, జానపద నృత్య రూపకాలు జరిగాయి. ఈ సందర్భంగా పీటీఎం సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పొనుగుమట్ల మాట్లాడుతూ లలిత కళలు నైతిక జీవితాలకు అద్దం పడతాయన్నారు. డాక్టర్ మద్దెల వెంకటేశ్వరరావు, పి.శివనాగరాజు, కేవీఎల్ సుబ్బారెడ్డి, వీహెచ్ ఆర్ఎస్ సుబ్రహ్మణ్యం, ఉంగరాల వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాదరావు తదితరులు ప్రసంగించారు. పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు.



సుమారు 48 ఏళ్ల తరువాత కలుసుకున్న పాత స్నేహితులు

48 ఏళ్ల అనుబంధం వారిది..

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 48 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు గురువారం తాళ్లరేవులో కలిసారు. 1975–76 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు తాళ్లరేవులోని రెడ్డి గిరిబాబు స్వగృహంలో కలిసి ఆనందంగా గడిపారు. చిట్టూరి నాగవెంకట రమేష్ అమెరికాలో స్థిరపడి, అక్కడి యువతినే వివాహం చేసుకున్నారు. చాలా రోజుల తరువాత పుట్టిన ఊరిపై మమకారంతో ఇక్కడికి వచ్చి పాత స్నేహితులతో ఆనందంగా గడిపారు. అనంతరం వారు చదువుకున్న పాఠశాలను సందర్శించి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యండమూరి శ్రీనివాసరావు, వేలూరి సూర్యనారాయణ, కామిశెట్టి సత్యబాల తదితరులు ఉన్నారు.

కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా సురేష్



సురేష్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

అమలాపురం రూరల్: జిల్లా కాపునాడు సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ అధ్యక్షుడు చెడీతాలింఖానా గురువు అబ్బిరెడ్డి వెంకట స్వామి (సురేష్) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు పురంశెట్టి రంగారావు ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. సురేష్‌ను కాపునాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనం నాగేశ్వరరావు,"సంయుక్త కార్యదర్శి గంగుమళ్ల శ్రీనివాసరావు, నాయకులు దూడల ఫణికుమార్ అభినందించారు.

సి-క్లాస్ లంకల లీజు పెంపు

పి.గన్నవరం: గతంలో ఏడాది మాత్రమే ఉన్న సి-క్లాస్ లంక భూముల లీజు పరిమితిని ప్రభుత్వం ఐదేళ్లకు పెంచిందని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. ఈ నేపథ్యంలో డివిజన్‌లోని లంక గ్రామాల్లో ఉన్న సి-క్లాస్ లంక భూముల సర్వేను శుక్రవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లతో గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పి.గన్నవరం లంకలో సి-క్లాస్ భూముల్ని పరిశీలించి, రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే శాంతియుత పోరాటం

- ఎమ్మెల్యే శ్రీనివాస అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్


యానాం: ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, రోగులకు అవసరమైన సీఎం సహాయ నిధి నుంచి సాయం అందజేయకుండా ప్రజా ఉత్సవాలకు రూ.32 లక్షలు మంజూరు చేయడం అన్యాయమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ పేర్కొన్నారు. గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై వందల సార్లు సీఎం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని, సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు పూలమాలలతో సత్కరిస్తారని, లేదంటే అడ్డుకుంటారని మాత్రమే అన్నానని సీఎం రంగసామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తన ఉద్దేశం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనను ఎన్నుకున్నారని, అలంకార ప్రాయంగా ఉండడానికి కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో తనను విస్మరించినప్పటికీ, ప్రోటోకాల్ పాటించకపోయినప్పటికీ బాధపడలేదని, కేవలం ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశమని దాని కోసం రాజీనామాకైనా సిద్ధమని స్పష్టం చేశారు. అందుకే శాంతియుతపోరాటం చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పీడబ్ల్యూడీ మంత్రి నమశ్శివాయంకు సైతం వచ్చిన ప్రతిసారీ అనేక వినతిపత్రాలు ఇచ్చానన్నారు.

నేటి నుంచి ప్రజా ఉత్సవాలు

యానాం: పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 19వ యానాం ప్రజా ఉత్సవాలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధ్యక్షతన నిర్వహించే ప్రజా ఉత్సవాలను సాయంత్రం 6 గంటలకు పుదుచ్చేరి పిడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. గౌరవ అతిథిగా మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మత్స్యశాఖ కార్యదర్శి ఎ.నెడుంచెజియన్ హాజరుకానున్నారు. మొదటి రోజు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా కోల్‌కతా బృందం శాస్త్రీయ నృత్యం, మాల్గాడి శుభ పాటలు, హేమంత్‌జైన్ మ్యాజిక్‌షో, శ్రీ కృష్ణ కుమార్ కూచిపూడి నాట్యాలయ విద్యార్థుల నృత్యాలు, ఫిల్మ్ డ్యాన్స్ ట్రూప్ ప్రోగ్రామ్ ఉంటుంది. కాగా ప్రజా ఉత్సవాల ఆహ్వాన పత్రికపై ఎట్టకేలకు ఎమ్మెల్యే గొల్లపల్లి ఫోటో, పేరును నిర్వాహకులు పొందుపరచారు. 20 నెలల కాలంలో ఏ ఒక్కశాఖ ప్రోటోకాల్ ప్రకారం ఆయన పేరు వేయకుండా, ఈ ఆహ్వాన పత్రికపై పేరు పెట్టడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు ఇక్కడి విధులు వద్దు

పబ్లిక్ పరీక్షల వేళ ఉపాధ్యాయులను ప్రజా ఉత్సవాల విధులకు పంపడాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ అంబేడ్కర్ దళిత రైట్స్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు మెల్లం శ్రీనివాసరావు, సబ్బతి శ్రీనివాసరావు గురువారం ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులంతా పరీక్షల హడావిడిలో ఉన్నారని, ఉపాధ్యాయులు వారిని సన్నద్ధం చేస్తున్నారని, ఈ సమయంలో ఈ నియామకాలు తగదని వారు కోరారు.



బాలయోగి స్టేడియంలో సిద్ధం చేసిన ప్రజా ఉత్సవాల వేదిక

ఆనప.. పది కిలోలండీ!





పదికిలోల పైగా బరువు ఉన్న ఆనప కాయ

తాళ్లరేవు: మండల పరిధిలోని పటవల పంచాయతీ ఎస్సీపేటలో కమిడి వీరగనిక ఇంటిపై ఆనప విరగకాసి అందరినీ అబ్బురపరుస్తోంది. ఈ పాదుకు ఒకేసారి పదికాయలు కాయడంతో పాటు ఒక్కొక్కటీ పది కిలోలకు పైగా ఉండడం విశేషం. తాళ్లరేవు సంతలో విత్తనాలు కొనుగోలు చేసి నాటానని, ఎటువంటి ఎరువులు వేయకపోయినా ఇంతత కాయలు కాయడం ఆశ్చర్యంగా ఉందని వీరగనిక అంటున్నారు. తామెప్పుడూ ఇంత పరిమాణంలో కాయలు చూడలేదని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల పంపిణీ



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల కృషి అభినందనీయమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం సాయంత్రం ఇందుపల్లి ఏ-వన్ కన్వెన్షన్ హాలులో జరిగిన అమలాపురం పట్టణ, రూరల్, గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్ల, వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో పట్టణానికి చెందిన ఐదుగురు వలంటీర్లకు నియామకపత్రాలు అందజేశారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ మండల పార్టీల అధ్యక్షుడు సంసాని చంద్రశేర్ (నాని) రూరల్ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ పింఛన్లు



లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ పింఛన్లు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.ఎస్.గౌరీ కుమారి ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల్లో 286 మందికి కొత్త పెన్షన్లు అందుతున్నాయని ఎంపీడీవో తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.